

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-గోకవరం


భూపతిపాలెం ఏపి గురుకుల పాఠశాలలో 5వ తరగతి 80 సీట్లకు గాను, 6వ, 7వ, 8వ తరగతి మిగిలిన ఖాళీలకు తగిన అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని భూపతిపాలెం ప్రిన్సిపల్ బి.రవి కోరారు. వాటి తోపాటు రాష్ట్రంలోని 7 జూనియర్ కళాశాలలు, నాగార్జునసాగర్ డిగ్రీ కళాశాలకు కూడా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రియల్ 25వ తేదీన జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరంలో పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపల్ బి.రవి తెలిపారు. 5వ తరగతి ప్రవేశం కోసం 4వ తరగతి, 6వ తరగతి ప్రవేశం కోసం 5వ తరగతి, 7వ తరగతి ప్రవేశం కోసం 6వ తరగతి, 8వ తరగతి కోసం 7వ తరగతి చదువుతూ ఉండాలని చెప్పారు.

అనపర్తి సీటు కోసం బిజెపి పట్టు

రాజమండ్రి ఎంపి స్థానంపైనా సందిగ్ధత
ఆందోళనలో టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో పార్లమెంటు స్థానంతో పాటు ఒక అసెంబ్లీ స్థానం ఇవ్వాలంటూ బిజెపి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో అనపర్తి నియోజకవర్గం సీటు కోసం బిజెపి పట్టు పట్టినట్లు తెలుస్తోంది. 2014 ఎన్నికల్లో టిడిపి నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 1373 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 2019లో వైసిపి అభ్యర్థి సత్తి సూర్యనారాయణ రెడ్డి 55,207 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. గడిచిన రెండుసార్లు ఇద్దరు అభ్యర్థులూ పోటాపోటీగా తలపడ్డారు. తాజాగా అధికార వైసిపి సత్తి సూర్యనారాయణ రెడ్డికి సీటు ఖరారు చేసిన విషయం విదితమే. టిడిపి అనపర్తి నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డికే తొలి జాబితాలోనే స్థానం లభించింది. అధికార పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత టిడిపి అభ్యర్థికి కలిసివస్తుందని కార్యకర్తలు భావించారు. అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఈ సీటు బిజెపికి కేటాయిస్తారనే ప్రచారం ఊపందుకుంది. టిడిపి, జనసేన కూటమి తొలిజాబితా ప్రకటించే నాటికి బిజెపితో పొత్తుపై స్పష్టత లేకపోవటమే దీనికి కారణమని తెలుస్తోంది. బిజెపినేతలు తొలుత రాజమహేంద్రవరం స్థానం కోరినట్లు సమాచారం. ఈ స్థానం అప్పటికే ఆదిరెడ్డి వాసుకు కేటాయిస్తూ అధినేత నిర్ణయించారు. టిడిపి బలమైన కేంద్రం కావటంతో బిజెపి భంగ పడక తప్పలేదు. అనంతరం



రాజానగరం కోరినట్లు తెలుస్తోంది. జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ కొంత కాలంగా ఈ నియోజకవర్గంపై కేంద్రీకరించారు. జనసేనాని తొలుత ప్రకటించిన రెండు సీట్లలో ఒకటి రాజానగరం కావటం విశేషం. ఈ రెండు స్థానాల్లో అభ్యర్థుల బలాబలాలను వివరించడంతో బిజెపి వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. తాజాగా అనపర్తి సీటు కోసం ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఏ మేరకు సఫలీకృతం అవుతుందో వేచి చూడాలి. మరో వైపు రాజమహేంద్రదవరం ఎంపీ స్థానంపైనా సందిగ్ధత నెలకొంది. టిడిపి, జనసేన, బిజెపి కూటమి తాజాగా మూడో జాబితా విడుదల చేసిన విషయం విదితమే. ఈ జాబితాలో అమలాపురం నుంచి టిడిపి అభ్యర్థిగా బాలయోగి తనయుడు హరీష్ బరిలో నిలిచారు. జనసేన పార్టీ నుంచి టీ టైం అధినేతగా సుపరిచితులైన తంగెళ్ల ఉదయ్ కుమార్ కాకినాడ ఎంపీ స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు కూటమి స్పష్టం చేసింది. రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా ఆ పార్టీ అధ్యక్షులు కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే పురందేశ్వరి వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఒంగోలు పార్లమెంటు స్థానం కోరుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ సీటుపై అభ్యర్థి ప్రకటన ఆలస్యమైందని తెలుస్తోంది. అధికార పార్టీ వైసిపి ఇప్పటికే ఎంపి అభ్యర్థిగా గూడూరి శ్రీనివాస్‌ను ప్రకటించిన విషయం విదితమే. అభ్యర్థిపై త్వరలోనే ఒక స్పష్టత ఇస్తారనే ఆశాభావం టిడిపి కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు 2024ను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో కూడి నిర్వహించడానికి అనుగుణంగా చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అందచేసే అభ్యర్థన మేరకు అనుమతులు ఇస్తామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను ఏర్పాటు చేసి ఆయా విభాగాలకు ప్రత్యేక నోడల్ అధికారులని నియమించినట్టు చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి బృందం (ఎంసిసి), 1950 కాల్ సెంటర్, సి-విజిల్, సువిధ, కంప్లయింట్ సెల్ , కమాండ్ కంట్రోల్ కేంద్రం, ఖర్చుల అంచనా బృందం, మీడియా ధ్రువీకరణ, పర్యవేక్షణ కమిటీ తదితర విభాగాలను ఏర్పాటు చేశామన్నారు. ఎంసిసి అధ్వర్యంలో 21 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ర, 21 స్టాటిస్టికల్ సర్వైవల్ బృందాలు, 21 వీడియో విజిలెన్స్ బృందాలు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తాయన్నారు. శనివారం ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద 96 కేసులు నమోద య్యాయని తెలిపారు.

28 నుంచి వైకల్య నిర్ధారణ పరీక్షల శిబిరాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఈ నెల 28వ తేదీ నుంచి జిల్లాలో వికలాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షా శిబిరాలను ఏర్పాటు చేసినట్టు సమగ్ర శిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైకల్య నిర్ధారణకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో నాలుగు చోట్ల మెడికల్ కాంప్‌లను ఏర్పాటు చేసినట్టు సుభాషిణి తెలిపారు. వైకల్య నిర్ధారణ తరువాత సరైన ఉపకరణాలు అందజేస్తామన్నారు. శిబిరానికి హాజరైన పిల్లలకు ఉచిత భోజనం, రవాణా ఖర్చులు ఇస్తారన్నారు. వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించ ుకోవలెనని సుభాషిణి కోరారు.

మతం పేర విభజించే బిజెపిని ఓడించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

బిజెపి అధికారాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలను మతం, కులం, జాతి, ప్రాంతం పేరుతో విభజించేందుకు కుట్రలు చేస్తోందని, ఆ కుట్రలను తిప్పి కొట్టి ఎన్నికల్లో బిజెపి, కూటమిని ఓడించి బుద్ధి చెప్పాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ పిలుపు ఇచ్చారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిన్న వయసులోనే బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడి 93 సంవత్సరాల క్రితం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించారని కొనియాడారు. ఆ వీరుల ఆశయాలైన అందరికీ సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య హక్కులు, అభివద్ధి, స్వేచ్ఛ, ప్రజల విశాల ఐక్యతను కాపాడడం కోసం మనం ప్రతిజ్ఞ తీసుకోవాలని అన్నారు. రష్యా సోషలిస్ట్ ప్రభుత్వం నిర్మాత లెనిన్ జీవిత చరిత్రను భగత్ సింగ్‌ను ఉరి తీస్తున్న సమయంలో కూడా అధ్యయనం చేశాడన్నారు. సోషలిజం మాత్రమే అన్ని సమస్యలకు పరిష్కారం అని భగత్ సింగ్ భావించాడని, అటువంటి అసమానతలు లేని సమాజం కోసం యువత కృషి చేయాలని కోరారు. ముందుగా భగత్ సింగ్ విగ్రహానికి నాయకులు టి అరుణ్, కె.రామకష్ణ, బి.రాజులోవ, బి.పవన్, పి తులసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మిక, రైతు, ప్రజాసంఘాల నాయకులు పి.వెంకటేశ్వరరావు, పి.రామకష్ణ, ఉమా, సుబ్రహ్మణ్యం, తాతారావు రాంబాబు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల పక్కన ఎస్‌టి బాలికల వసతి గృహం, ఎస్‌సి బాలుర స్కూల్ హాస్టల్‌లో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌కు ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.జ్యోతిర్మయి, జిల్లా కమిటీ సభ్యులు దుర్గ, అచ్చారావు పాల్గొన్నారు.

కడియం దేవి గుడి సెంటర్లో భగత్ సింగ్ సేవా సంస్థ అధ్యక్షుడు తమ్మిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యాన భగత్ సింగ్ 93వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది తోరాటి వసంతరావు మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర సమరయోధుల బలిదానం ఫలితంగా మనం స్వేచ్ఛ స్వాతంత్రాలను అనుభవిస్తున్నామన్నారు. అనంతరం భగత్ సింగ్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మద్రి సుబ్రహ్మణ్యం, చిరుకూరి నాగేశ్వరరావు, నందం వీరబాబు, చల్లా అంజి, పళ్ల వెంకటగిరి, కళ్యాణపు సూరిబాబు పాల్గొన్నారు.

రాజానగరంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు మాట్లాడారు. మరుకుర్తి వీరలక్ష్మి , తామెరల గౌరీ, నక్కా లక్ష్మి, గున్నూరు అరవాలమ్మ, తోటకూర బేబీ, మార్గాని సత్యవతి, అనంతలక్ష్మి, జగదాంబ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ముస్లిములకు రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్ల పంపిణీ చేస్తున్న కంటిపూడి కిరణ్ కుమార్

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల గ్రామంలో సుమారు 30 కుటుంబాలకు గ్రామానికి చెందిన సామాజికవేత్త కంటిపూడి కిరణ్ కుమార్ కిట్లు అందజేశారు. రంజాన్ సందర్భంగా సుమారు రూ.15 వేల విలువైన వీటిని శనివారం స్థానిక మసీదులో పంపిణీ చేశారు. గోధుమ, చక్కెర, నెయ్యి, సేమియా ప్యాకెట్లు వంటి వాటిని ముస్లిం సోదరులకు అందించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గుర్రపు కొండయ్య మాస్టారు, ఈదర నందబ్బు మాట్లాడుతూ మూడేళ్లుగా రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లిం కుటుంబాలకు రూ.వేల విలువైన అపరాల కిట్లను అందిస్తున్న కిరణ్ కుమార్‌ను అభినందించారు. గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో తన వంతు సాయం చేస్తూ కిరణ్ స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. కరోనా కాలంలో పేదలతో పాటు పారిశుధ్య కార్మికులకు, వైద్య సిబ్బందికి కిరణ్ సాయం అందించారన్నారు. హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ పుట్టిన గ్రామంపై ఉన్న అభిమానంతో కిరణ్ చేస్తున్న సేవలు ఎనలేనివని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా ఎందరికో ఆయన ఆదర్శంగా నిలవాలన్నారు. ముస్లిం సోదరులు కిరణ్‌ను సత్కరించి అభిమానం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి వెంకన్న చౌదరి, మసీదు సంఘం ప్రెసిడెంట్ షేక్ సత్తార్, వైస్ ప్రెసిడెంట్ షేక్ మీరయ్య, సెక్రటరీ షేక్ సిద్దా మీరయ్య, గౌరవ అధ్యక్షుడు షేక్ మీరా సాహెబ్, కోశాధికారి షేక్ సుభాన్, మాబు పాల్గొన్నారు.

ముస్లిములకు అండగా ఉంటా : ఎంపీ భరత్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ముస్లిం సోదరులకు ఏ సమయంలో ఏ కష్టం వచ్చినా మీ చోటా భయ్యా భరత్ ఉన్నాడనే విషయాన్ని మర్చిపోవద్దని రాజమండ్రి ఎంపీ, వైసిపి సిటీ నియోజకవర్గ అభ్యర్థి మార్గాని భరత్ రామ్ భరోసా ఇచ్చారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని తాడితోట నూర్ మసీదులో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. రంజాన్ మాసంలో ఎంతో భక్తి శ్రద్ధలతో, అత్యంత కఠోరమైన ఉపవాసాన్ని కొనసాగిస్తారన్నారు. రంజాన్ మాసంలో ముస్లిములు చూపే త్యాగం, సహనం, దానం, ప్రేమ లోక కల్యాణానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలని రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు చేసే పవిత్ర కార్యక్రమం అందరికీ ఆదర్శమన్నారు. నగరంలో ముస్లింల షాదీ ఖానా నిమిత్తం దాదాపు రూ.36 కోట్ల విలువజేసే 1800 గజాల స్థలాన్ని సమకూర్చామని చెప్పారు. ఆ షాదీ ఖానాకు తన ఎంపీ నిధుల నుండి రూ.50 లక్షలు ప్రకటిస్తే ఆ వెంటనే తన పిలుపునకు స్పందించి పలువురు విరాళాలు ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలోనే అతి పెద్ద షాదీ ఖానా రాజమండ్రి నగరంలో నిర్మించబోతున్నట్టు ఎంపీ భరత్ తెలిపారు.

1వ తరగతిలో అడ్మిషన్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతికూల పరిస్థితుల పిల్లలు ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 31 వరకు గడువు పెంచినట్టు అర్బన్ రేంజ్ డి ఐ.బి దిలీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, హెచ్ఐవి బాధితులు, వికలాంగులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఒసి వర్గాల పిల్లలు ఒకటో తరగతిలో ప్రవేశం పొందడానికి ఈ నెల 25తో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగియనుండటంతో అధిక సంఖ్యలో విద్యార్థులకు అవకాశం కల్పించాలని గడువు పెంచినట్టు తెలిపారు. విద్యార్థుల నివాసానికి సమీపంలో ఉన్న ఐబి, సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం కోటా కింద ప్రవేశం పొందవచ్చని తెలిపారు. cse.ap.gov.in వెబ్‌సైట్ లేదా దగ్గరలోని సచివాలయం, ఇంటర్నెట్, మండల విద్యాశాఖాధికారి కార్యాలయం, మీ సేవలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి-గోపాలపురం



చలివేంద్రాన్ని ప్రారంభించిన సభ్యులు

వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని వర్తక సంఘం అధ్యక్షులు వెన్న వెంకట్రావు, సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు అన్నారు. శనివారం దొండపూడిలో హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో బస్టాండ్ దగ్గర శనివారం చలివేంద్రం ప్రారంభించారు. వర్తక సంఘం అధ్యక్షుడు వెన్న వెంకట్రావు, సర్పంచ్ అచ్చిబాబు మాట్లాడారు. దాతల సహకారంతో హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ చలివేంద్రం ద్వారా వేసవికాలంలో ప్రయాణికులు, బాటసారులకు, స్థానికులకు ఎంతోమందికి ఆర్ఒ కూలింగ్ వాటర్ అందించడం దాహార్తిని తీర్చేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మొదటి రోజు చలివేంద్రంలో సుమారు 200 మందికి పైగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడానికి గ్రామస్తుల సహాయ సహకారాలతో, గ్రామస్తులు, వ్యాపారస్తుల ద్వారా ఈ హెల్పింగ్ హాండ్స్ గ్రూప్‌నకు 25 వాటర్ కేన్స్ స్వచ్ఛందంగా బహూకరించారని తెలిపారు. హెల్పింగ్ హాండ్స్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం పట్ల వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల ముత్యాల రాయుడు, పోతిరెడ్డి నాగరాజు, బండారు. గన్నిరాజు, హెల్పింగ్ హాండ్ సభ్యులు మారాజు రాజేష్, నున్న అనంత మణికుమార్, వెల్లంకి జయ శివ సూర్యం, కొమ్మన ప్రసాద్, మధు రమాకాంత్ నగరగంటి వాసు, షేక్ మాబు, సుభాన్, షేక్ మస్తాన్, పిల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు 109 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-తాళ్లపూడి

శనివారం జరిగిన పదవ తరగతి పరీక్షలకు 109 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారులు బాలామణి, నెహ్రూజీ తెలిపారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 891 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 782 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వీరు తెలిపారు.

పేదలకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-చాగల్లు

ఆకలితో ఉన్న నిరుపేదలు, ఆపదలో ఉన్న నిర్భాగ్యులను ఆదుకోవడమే మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యం అని ట్రస్ట్ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు అన్నారు. సేవా కార్యక్రవల్లో భాగంగా శనివారం చాగల్లు మండలం, చంద్రవరం గ్రామంలో సుమారు 15 నిరుపేద కుటుంబాలకు 15 కేజీల చొప్పున నాణ్యమైన బియ్యం ఉచితంగా గ్రామ నాయకులు అయిన మడిపాటి శ్రీనివాసు రావు (శ్రీరామమూర్తి), మడిపాటి కోదండరావు, మద్దిపాటి శ్రీనివాస్ రావు, బండి అశోక్, బండి సత్యనారాయణ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కాత్రు వీర్రాజు, చక్రవర్తి, సంతోష్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు శాఖా గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఎం.శేఖర్ బాబు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో గల వివిధ రికార్డులను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. చాగల్లు శాఖా గ్రంథాలయం పరిధిలో నెలటూరు పుస్తక పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేశారు విద్యార్థులతో మాట్లాడి వారికి పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను గురించి వివరించారు.

ఎన్నికలపై రాజకీయ పార్టీలు సహకరించాలి


ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

అన్ని రాజకీయ పార్టీలూ, పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికలకోడ్‌కు కట్టుబడి ఉండాలని, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలతో మోడల్ ప్రవర్తనా నియమావళి ఫిర్యాదులపై జిల్లా స్థాయి ప్రామాణిక కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, సహృదయ వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించుకోవడం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన అంశాలపై ఆశావహ దృక్పథంతో చర్చించి వాటికి పరిష్కారం కోసం కమిటీ సభ్యులు సూచనలు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో కమిటీ సభ్యులుగా ఏడు రాజకీయ పార్టీలకు చెందిన వారిని నియమించినట్టు తెలిపారు. బిఎస్‌పి-పట్నాల విజయ్ కుమార్, బిజెపి-బొమ్ముల దత్తు, ఆమ్ ఆద్మీ పార్టీ-మన్నవ రఘురాం, సిపిఎం-పి.అరుణ్ కిరణ్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్-అరిగెల అరుణ, టిడిపి-కెఎస్ జవహర్, వైసిపి-జక్కంపూడి రాజాను కమిటీలో నియమించినట్టు చెప్పారు. కమిటీ చైర్మన్‌గా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత, మెంబర్-కన్వీనర్‌గా రుడా విసి బి.బాలస్వామి వ్యవహరిస్తారని మాధవీలత తెలియ చేశారు. ఎన్నికలు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సజావుగా సాగేందుకు, వివిధ దశల్లో రాజకీయ పార్టీలు, పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి గుర్తించిన వాటిపై కమిటీలో చర్చించి అభిప్రాయాలు పరిగణన లోకి తీసుకుని ఆ మేరకు కమిటీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో చర్చించి సూచనలు అభిప్రాయాలు మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఎటువంటి ప్రచారం నిర్వహించినా 'ఎన్ కోర్" యాప్ ద్వారా అనుమతులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ర్యాలీల నిర్వహణా సమయంలో కనీస దూరం పాటించడం, గోడలపై ఎటువంటి రాతలు రాయకూడదు అని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రకృతి విపత్తులు, తదితర అత్యవసర పరిస్థితుల్లో కమిటి సమావేశం నిర్వహించి, కమిటీ సభ్యుల అభిప్రాయాలు మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదుల నమోదు కోసం జిల్లాలో టోల్ ఫ్రీ నెంబర్ 1800- 425 - 2540 కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలూ మూడు షిఫ్ట్‌లలో ప్రజలు, రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ టోల్ ఫ్రీ నెంబర్ 1950 కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సి విజిల్ యాప్ ద్వారా వచ్చేయ ఫిర్యాదుల విషయంలో 100 నిమిషాల్లో స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ 4వ విడతలో నిర్వహిస్తున్న మేరకు నియమావళిని అనుసరించి ప్రవర్తించాల్సిన నియమ నిబంధనలపై మరింతగా దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న దష్ట్యా 24 అంశాలకు సంబంధించిన అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని, వాటి వివరాలు అందచేశామన్నారు. ఉల్లంఘనలకు సంబందించి తెలిసి తెలియక చేసినా వాటిపై వివరణ కోరతామని, వాటిపై కమిటీ సభ్యుల సమక్షంలో చర్చించి అభిప్రాయాలు మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారున. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, సభ్యులు- కన్వీనర్ బి.బాల స్వామి, సభ్యులు పి.ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వ్యాపారులపై కక్ష గట్టిన ఎంపీ : టిడిపి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

నగరంలోని వ్యాపారులపై ఎంపీ మార్గాని భరత్ రామ్ కక్ష కట్టారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో శనివారం టిడిపి ట్రేడర్స్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టిడిపి నగర కమిటీ ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, మాజీ కార్పొరేటర్ యిన్నమూరి రాంబాబు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ట్రేడర్స్ సెల్ ఆధ్వర్యంలో నగరంలో 22 రోజుల పాటు పర్యటించి వ్యాపారులను కలిశామన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ తమపై కక్ష కట్టారని వ్యాపారులంతా ముక్తకంఠంతో చెప్పారన్నారు. వ్యాపారాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లోనే భరత్ రామ్ రోడ్లు తవ్వేసి నెలల తరబడి అలాగే ఉంచేస్తున్నారని చెప్పారు. తన 25 పర్సెంట్ కమిషన్ కోసం భరత్ రామ్ ఏం చేయడానికైనా, ఎవరిని ఇబ్బంది పెట్టడానికైనా సిద్ధమేనని ఆరోపించారు. దేవీ చౌక్‌లో బ్యూటిఫికేషన్ కోసం రెండు నెలల పాటు రోడ్లు బ్లాక్ చేయడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సెంట్రల్ లైటింగ్ నిమిత్తం మెయిన్ రోడ్డులో కూడా అదే జరిగిందన్నారు. నగరంలో ఏమైనా అభివద్ధి పని మొదలు పెట్టె ముందు అందరినీ సంప్రదించాలన్నారు. మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగితే అవి ఏర్పాటు చేసినందుకు, తెసేసినందుకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని భరత్ అన్నారని, ఇప్పుడు ఆ ఖర్చు ఆయనే భరిస్తా అని ప్రశ్నించారు. అభివద్ధికి తెలుగుదేశం పార్టీ ఏనాడు వ్యతిరేక కాదని, అయితే హడావుడి శంఖుస్థాపనలు, ప్రజలను, వ్యాపారులను ఇబ్బంది పెట్టే పనులు చేయడం మంచిది కాదని సూచించారు. నగరంలోని ఎవి.అప్పారావు రోడ్డు, దానవాయి పేట తదితర ప్రాంతాల్లో రోడ్లు తవ్వి నెలలు అవుతోందని, దాని వల్ల అన్ని వర్గాల వారు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రోడ్లు తవ్వేయడంతో 40 రోజులుగా వ్యాపారాలు లేవని అద్దెలు, సిబ్బందికి జీతాలు, కరెంటు, పన్నులు ఎవరు చెల్లిస్తారని వ్యాపారులు అడుగుతున్నారని అన్నారు. పుష్కరాల సమయంలో ఎవరికి ఇబ్బంది లేకుండా తాము చాలా పనులు చేసామన్నారు. నగరంలో జరుగుతొంది అభివద్ధో లేక భరత్ దుర్బుద్ధో తెలియడం లేదన్నారు. ప్రస్తుతం రాజమండ్రి పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందన్నారు. కమ్యూనిటీ హాళ్లను సచివాలయాలకు ఇచ్చి ఇప్పుడు మళ్లీ కమ్యూనిటీ హాళ్లను శంఖుస్థాపన చేయడం విడ్డురంగా ఉందన్నారు. నగరంలో ప్రధానంగా ఎంపీ భరత్ రామ్, వారి బంధువులు, వైసిపి నాయకుల ఆస్తులు ఉన్న ప్రాంతాల్లోనే అభివద్ధి జరుగుతోందన్నారు. శివారు ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా ఉందన్నారు. భరత్ తన సినిమా మాదిరిగా వన్ టైం పొలిటీషియన్స్ మాత్రమేనని అన్నారు. ముందు పెద్దలకు గౌరవం ఇవ్వడం నేర్చుకోవాలని భరత్‌కు సూచించారు. ఈ సమావేశంలో నగర ట్రేడర్స్ సెల్ అధ్యక్షులు నిమ్మలపూడి గోవింద్, ప్రధాన కార్యదర్శి మస్తాన్ చౌదరి, నాయకులు ముప్పన రుద్ర, మదీనా సాహెబ్ పాల్గొన్నారు.

రూరల్‌లో వలస నేతల పాగా..

ప్రజాశక్తి-కడియం

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం ఏర్పడ్డ 2009 నుంచి వలస నేతలకు అడ్డాగా మారింది. అంబేద్కర్ కోనసీమసీమ జిల్లా నుంచి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, రాజమహేంద్రవరం సిటీకి చెందిన గోరంట్ల బుచ్చియ్యచౌదరి ప్రస్తుతం ఇక్కడ తలపడుతున్నారు. గతంలో వడ్డి వీరభద్రరావు, గిరజాల వెంకటస్వామి నాయుడు, పాటంశెట్టి అమ్మిరాజు వంటి స్థానిక నేతలు చట్టసభలకు వెళ్లగలిగారు. మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు స్థానికుడు కాకపోయినా, ప్రజల మధ్య తిరిగి, రాజకీయ పోరాటాలు చేసి, నాయకుల సహాయ, సహకారాలతో స్థానిక నేతగా మారిన తర్వాత చట్ట సభలకు వెళ్లగలిగారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధిని మంత్రిగా సాకారం చేశారు. దశాబ్దన్నర కాలంగా వలస నేతలు ఇక్కడ టికెట్లు పొంది గెలిచిన వారు చట్టసభలకు వెళుతుండగా, ఓడిన వారు నగరంలో నివాసముంటున్నారు స్థానికంగా మాత్రం ఒక నేతను, మరో నేత తొక్కుకుంటూ సొంత పార్టీ నేతలను ఓడించుకుంటూ వలసనేతల పాలనకు రూరల్ నియోజవర్గ నాయకులు, ప్రజలు అలవాటు పడిపోయారు. నియోజకవర్గంలో మేజర్ సామాజిక వర్గాల్లో ఆర్థిక పరపతి, రాజకీయ దన్ను, ప్రజల్లో పట్టు, పలుకుబడి ఉన్న నేతలు చాలామంది ఉన్నారు. అయినా వారంతా ఆయా గ్రామాలకే పరిమితం కావడంతో రాష్ట్ర నాయకత్వాల దష్టిలో వీరందరూ ద్వితీయ శ్రేణిగానే మిగిలిపోతున్నారు. భవిష్యత్తులోనైనా వలసలను నిలువరించి, స్థానిక నాయకత్వాన్ని బలపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

పాల టిన్నుల్లో సారా రవాణా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

పాల వ్యాపారం పేరుతో పెద్ద ఎత్తున నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు ఎక్సైజ్ అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సిఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల తనిఖీల్లో భాగంగా ఏలేశ్వరం ఎర్రవరం ఆర్ అండ్ బి రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా పాల టిన్నుల్లో వంద లీటర్ల నాటుసారా ప్యాకెట్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారు చేసిన, అమ్మిన, వేరే ప్రాంతాలకు తరలించిన కఠిన శిక్షలు తప్పవు అని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఎం.అశాత్, సిబ్బంది వెంకన్న దొర, కృష్ణారావు, దొరబాబు రాజు, వీరభద్రరావు, రాంబాబు, సలాం పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆలమూరు

ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపిన వివరాలు ఇవి.. అనంతపురం జిల్లా మూడి దిబ్బ మండలంలోని వేములవాడపల్లెకు చెందిన ఊడలపల్లి రమేష్ బాబు(45) మండల కేంద్రంలో నివాసం ఉంటున్న సోదరుడు ఊడలపల్లి రామకృష్ణ ఇంటికి అప్పుడప్పుడు డబ్బులు కోసం వస్తుంటాడు. అదే విధంగా ఈ నెల 19న సోదరుని వద్దకు డబ్బులు కోసం వచ్చి వెళ్లాడన్నారు. శనివారం ఉదయం జొన్నాడ ఏటు గట్టు రోడ్ పక్కన ఉన్న మామిడి చెట్టుకి ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నట్లుగా గుర్తించామన్నారు. దీనిపై మృతుని సోదరుడి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. అయితే మృతునికి తల్లిదండ్రులు లేకపోవడం వలన ఇప్పటివరకు వివాహం కాలేదన్నారు. మద్యానికి బానిసై, చెడు వ్యసనాలకు అలవాటైనట్లు మతిని సోదరుడు తెలిపాడన్నారు. దీంతో అప్పులు ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక అంచనా వేసినట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టామన్నారు.

కించపరిచేలా ప్రకటనలు వద్దు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

గైగోలుపాడులోని లూథరన్ చర్చ్ ఆస్తులు కాపాడేందుకు తాము పారదర్శకంగా పనిచేస్తే సంఘ సభ్యులు విశ్వాసం పొందామని, కావాలని కొందరు తమను కించపరిచేలా ప్రకటనలు ఇవ్వడం సరికాదని ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రెసిడెంట్. కొంగు సామ్యూల్, జనరల్ సెక్రటరీ బి.డేవిడ్, కోశాధికారి పివిఎస్.రెడ్డి అన్నారు. ఆవేదన వ్యక్తం చేశారు. గైగోలుపాడు లూథరన్ చర్చ్ ప్రాంగణంలో శనివారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సంఘ సభ్యులు సహకారంతో లూథరన్ చర్చ్‌లో ఇటీవల పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సంఘ విషయాలలోకి ఏ సంస్థగాని, వ్యక్తులు గాని కలుగ చేసుకోవద్దని అన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి సాల్మన్ రాజు, వైస్ ప్రెసిడెంట్ చింద్రిపు వినయ్, సంయుక్త కార్యదర్శి దాసరి డేవిజ్ జయకుమార్3, జెవిఎస్.రమణ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు మండలంలోని పోతులూరు, వాకపల్లి, వెంకటనగరం, తోటపల్లి గ్రామాలలో ప్రత్తిపాడు సిఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం సింగరంపాలెంలో మందకొండమా లక్ష్మి అమ్మ 24వ జాతర మహోత్సవాల సందర్భంగా బాబు రాజేంద్రప్రసాద్ మెమోరియల్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ప్రారంభం అయ్యాయి. ఈ నెల 24వ తేదీ వరకూ ఫ్లెడ్ లైట్స్ వెలుతురులో జరుగే వాలీబాల్ పోటీలను కామినేని జయశ్రీ, జోగి, రాధిక, కోర్పు దుర్గా ప్రసాద్, జాస్తి వసంత్ ప్రారంభించారు. ఈ పోటీలకు 24 టీములు పాల్గొనగా నాకౌట్ పద్ధతిలో నిర్వహించడం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి ఎస్.నాగరాజు, శ్రీనివాస్, ఆనంద్,ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి

రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సిఐ లక్ష్మణరావు సూచించారు. శనివారం మండలంలోని మల్లేపల్లి గ్రామంలో నవుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎటువంటి ఘర్షణలకు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఎలక్షన్ సమయంలో నమోదు కాబడిన కేసులు వారి భవిష్యత్తుపై మరింత ప్రభావం చూపుతాయని గుర్తుంచుకోవాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక రమణయ్యపేట మోహన్ డిగ్రీ కాలేజిలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే మెడికవర్ హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ రాజేష్, డాక్టర్ శావ్య వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా బి.పి, షుగర్, ఇసిజి పరీక్షలు నిర్వహించారు. స్త్రీల సమస్యలపై చికిత్సపై అవగాహన కల్పించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ విద్యాసంస్థల కరస్పాండెంట్. ఎమ్.మోహన్‌రావు, డైరెక్టర్. వెంకటేష్, కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీరాంబాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నష్టాలపై అవగాహన

ప్రజాశక్తి-రామచంద్రపురం

బాల్యవివాహాల వాటి వల్ల కలిగే అనర్థాలపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. కె.గంగవరం జిల్లా పరిషత్ హై స్కూల్లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో అంగన్‌వాడీ సూపర్వైజర్లు చంద్రకళ, శారద, మాట్లాడారు. హై స్కూల్ విద్యార్థులకు బాలివివాహాల వల్ల జరిగే నష్టాలు, చిన్న వయసులో వివాహాల వల్ల రక్తహీనత, పలు వ్యాధులపైనా తదితర అంశాలను వివరించారు.

ఎన్నికల నగారాతో అటెన్షన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి



2024 సార్వత్రిక ఎన్నికలకు నగరా మోగడంతో రాజకీయ పార్టీలతో పాటు అధికార యంత్రాంగంలోనూ అటెన్షన్ మొదలైంది. కొంతకాలంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఓటర్ల నమోదు, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, అధికారుల బదిలీలు, ఇవిఎంల భద్రత తదితర ప్రక్రియలను అధికార యంత్రాంగం చకచకా పూర్తి చేసిన విషయం విదితమే. మరో వైపు రాజకీయ పార్టీలు సైతం తమ చకా సిద్ధం అయిపోయాయి. అధికార, విపక్ష పార్టీలు నియోజక వర్గాలవారీగా ఆర్థిక, సామాజిక సమీకరణలతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను దాదాపు పూర్తి చేశాయి. అధికార వైసిపి ఎంపి సెగ్మెంట్, ఎంపి స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించగా, టిడిపి, జనసేన, బిజెపి కూటమి కొన్ని స్థానాల్లో ప్రకటించాల్సి ఉంది. తాజాగా ఎన్నికల షెడ్యూల్ జారీతో మరో అడుగు ముందుకు పడింది. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ప్రచార అనుమతులకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఖర్చులు చూపించేందుకు కసరత్తు ముమ్మరం చేశాయి. 2 నెలల కాల వ్యవధి నేపథ్యంలో ఈ కసరత్తు కత్తిమీద సాములా మారిందనే అభిప్రాయం అభ్యర్థులలో వ్యక్తమవుతోంది. అయితే ఏ మేరకు నిబంధనలకు లోబడేందుకు అప్రమత్తమవుతారో వేచి చూడాల్సి ఉంది. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఇప్పటికే ఎన్నికల కమిషన్ స్పష్టం చేయటంతో అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ప్రచార జోరుకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. అభ్యర్థులు ఆచితూచి అడుగులు వేయడం ప్రారంభించారు. మరోవైపు ఇప్పటికే ముఖ్యమైన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లపై అధికార యంత్రాంగం కొరడా ఝుళిపించింది.

తొలి వేటు వాలంటీర్లపైనే

రాష్ట్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా వాలంటీర్లు సమిధలయ్యారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైన విషయం విదితమే. ఎన్నికల విధులకు ఉపయోగించరాదని ఇప్పటికే పలుమార్లు ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసిన విషయం విదితమే. అయినప్పటికీ అధికార పార్టీ కోసం ఇంటింటి ప్రచారానికి తెరలేపారని టిడిపి నాయకులు విమర్శించడంతో ఉన్నతాధికారులు దృష్టి సారించారు. పరిశీలనతో రుజువు కావటంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాలంటీర్లను విధుల నుంచి తొలగించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. గడిచిన నాలుగేళ్లలో కేవలం రూ.5 వేల వేతనం చెల్లించి ప్రభుత్వ విధులు అప్పగించింది. తాజాగా తొలగింపుల నేపథ్యంలో ఉపాధికి గండి పడింది. దీంతో వాలంటీర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది.

టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థుల ప్రకటన

టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో ఎంపి అభ్యర్థుల సస్పెన్స్ ఎట్టకేలకు తెరపడింది. ఈ వారంలో విడుదల చేసిన మూడో జాబితాలో అమలాపురం, కాకినాడ ఎంపి స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానానికి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. ఈ స్థానం బిజెపి కేటాయిస్తున్న నేపథ్యంలో దాదాపుగా అభ్యర్థి ఖరారైనట్లు తెలుస్తోంది. త్వరలోనే ప్రకటిస్తారనే ప్రచారం ఊపందుకుంది. రాజమహేంద్రవరం ఎంపీ స్థానం మినహా మిగిలిన రెండు స్థానాల్లో యువతకు అవకాశం లభించింది. అమలాపురం ఎంపి స్థానంలో మాజీ స్పీకర్ ఎం.బాలయోగి తనయుడు ఎం.హరీష్‌ను బరిలో నిలిపారు. కాకినాడ బరిలో టీ టైమ్ అధినేత తంగెళ్ల ఉదయ్ కుమార్ తలపడనున్నారు. ఈ స్థానంలో అధికార పార్టీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌తో పోటీ పడనున్నారు. అమలాపురం ఎంపి బరిలో అధికార పార్టీ రాపాక వరప్రసాదరావు బరిలో నిలిచింది. ఇరు పార్టీలలో అభ్యర్థుల ఆర్థిక, సామాజిక సమీకరణలు ఎలా ఉన్నా ఓటర్లను ఏ మేరకు ఆకట్టుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

యానాం వార్తలు

ఘనంగా మీసాల వెంకన్న రథోత్సవం

ప్రజాశక్తి - యానాం


వీధుల్లో సాగుతున్న రథం

యానాం వెంకటేశ్వరస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. స్థానిక చిన్నా సెంటర్‌లో రథం వద్ద ఆలయ అర్చకులు, వేదపండితులు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు తదితరులు పూజలు చేశారు. అనంతరం రథోత్సవం భక్తుల కోలాహలం మధ్య ప్రారంభమైంది. యానాం వెంకన్న రథాన్ని భక్తులు భారీ తాళ్ల సహాయంతో లాగారు. స్థానిక చిన్నా సెంటర్ నుంచి పిల్లారాయవీధి మీదుగా బస్ కాంప్లెక్స్ వరకు రథయాత్ర భక్తుల మధ్య కన్నులపండువగా సాగంది. దారి పొడవునా భక్తులు షాపులు, డాబాల పైకి ఎక్కి రథయాత్రను భక్తులు ఆద్యంతం తిలకించారు. రథంను రాత్రి బస్ కాంప్లెక్స్‌లో నిలుపుదల చేయగా వందలాది మంది భక్తులు రథంపై కొలువైన స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం నుంచి ఉదయం వరకు భారీ తీర్థం జరిగింది. యానాం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. యానాం పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఆదివారం చక్రతీర్థం నిర్వహించనున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం


ఉత్సవాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్

యానాం బైపాస్ రోడ్డులో బాలయోగి వారధి వద్ద నూతనంగా నిర్మించిన దొడ్డి గంగమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని పూజలు చేశారు. ముందుగా కమిటీ ప్రతినిధులు, పండితులు ఎంఎల్ఎకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 25 న అమ్మవారి విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, అన్నసమారాధన కార్యక్రమం జరగనుందని ఆలయ నిర్వహకులు తెలిపారు.

చెక్ పోస్ట్ సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాం సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మజ్జిగను పంపిణీ చేశారు. యానాం రీజన్సీ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యానాం రీజియన్ కో-ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.వీరకుమార్ పాల్గొన్నారు.

మలకపల్లిలో తలారి ప్రజా ఆశీర్వాద యాత్ర

ప్రజాశక్తి-తాళ్లపూడి

అవ్వ, తాత మీకు పెన్షన్ తో పాటు జగనన్న నవరత్నాలు పథకాలు అందుతున్నాయా లేదా అంటూ వైసిపి కొవ్వూరు అభ్యర్థి తలారి వెంకట్రావు మండలంలోని మలకపల్లి గ్రామంలో ప్రజలను కలుస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. శనివారం మలకపల్లిలో తలారి వెంకట్రావు రెండో రోజు ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ తనను ముఖ్యమంత్రి జగనన్న పంపించారని, రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని అన్నారు. గ్రామానికి వచ్చిన తలారికి పార్టీ సీనియర్ నాయకులు సొసైటీ అధ్యక్షులు కుంటముక్కల కేశవ నారాయణ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకులు సిర్రా గంగారావు పలు గ్రామాల సర్పంచులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సోమాలమ్మ జాతర

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పాత సోమాలమ్మ తల్లి అమ్మవారి జాతర ఉత్సవం శనివారం కోలాహలంగా నిర్వహించారు. రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదీ అమ్మవారి జాతర ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అడపా అనిల్, ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.1158 కోట్లతో రాజానగరం అభివృద్ధి

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం నియోజకవర్గంలో రూ.1158 కోట్లతో అభివద్ధి పనులు, రూ.1142 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేసినట్టు ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు.కొండగుంటూరు, తోకాడ గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో నాయకులను కలుసుకుని విజయానికి సహరించాలని కోరారు. కొండగుంటూరు గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న మల్లంపల్లి నాగేశ్వరావు, గిరిజాల సోమరాజు తదితరులను పరామర్శించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ రాజానగరం నియెకవర్గంలో ప్రజలు తన వెంట ఉన్నారని విజయం తథ్యం అన్నారు. జనసేన అసత్యపు ప్రచారాలను ప్రజలు తిప్పి కొడతారన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంటపల్లిలో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం

పెంటపల్లి గ్రామంలో వైసిపి జగ్గంపేట అభ్యర్థి, మాజీ మంత్రి తోట నరసింహం తనయుడు తోట రామ్‌జీ శనివారం ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌జీ ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. తోట నరసింహంను ఎంఎల్ఎగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు.


అంగన్‌వాడీ కేంద్రంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

అంటు వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్-ఎస్ విభాగం ఆధ్వర్యంలో చివటంలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపులో భాగంగా శనివారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. అక్కడి విద్యార్థులకు శుభ్రత, పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. గ్రామంలోని వైద్యాధికారులను కలిసి, అవగాహన కల్పించుకున్న అనంతరం, ఇంటింటికీ వెళ్లి అంటు వ్యాధుల నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.అనిల్ కుమార్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఆర్‌కె ఫణిధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విష్ణు వర్ధన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బత్తుల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - సీతానగరం

జనసేన రాజానగరం బత్తుల బలరామకృష్ణ ఆదివారం మూడు మండలాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇనఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, బత్తుల వెంకటలక్ష్మి, తోట పవన్ కుమార్, తోట ప్రత్యూష దేవి, బత్తుల వందనాంబిక, జనసేన నాయకులు, టిడిపి నాయకులు, బిజెపి నాయకులు, పాల్గొనబోతున్నారని బలరామకృష్ణ తెలిపారు.


'డెల్టా'లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒపి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక డెల్టా హాస్పిటల్స్‌లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒపి క్లినిక్ ప్రారంభించినట్టు హాస్పిటల్ ఎమర్జెన్సీ విభాగ వైద్యులు డాక్టర్ నాగేశ్వరరావు, సీనియర్ కన్సల్టెంట్ హెమటాలజిస్ట్ డాక్టర్ చందన్ కుమార్ చెప్పారు. లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ వైద్యులు డాక్టర్ అమర్‌నాథ్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాకటర్ రామ్ గోపాల్ తేజతో కల్సి శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. లివర్ మార్పిడికి సంబంధించిన సమస్యలపై వచ్చేవారిని పరీక్షించి తగు సూచనలు చేయడానికి లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఒపి క్లినిక్ పెట్టామని తెలిపారు. ప్రారంభ దశలోనే గుర్తించడం వల్ల లివర్ మార్పిడి వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. దాదాపు రూ.25 లక్షల వరకు ఇందుకు ఖర్చు అవుతుందని, సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షల వరకు మంజూరు అవుతుందని తెలిపారు.

కొవ్వూరులో పాత్రికేయుల ర్యాలీ

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్


వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

జాతీయ జర్నలిస్టుల కోరికల దినోత్సవం సందర్భంగా కొవ్వూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో తొలుత భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కార్యదర్శి డి.సోమసుందర్ ఆధ్వర్యంలో పాత్రికేయులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో కొవ్వూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నల్ల నాయుడు బాబు, కార్యదర్శి ప్రకాష్, సాక్షి సత్యనారాయణ, అవినాష్, ఎబిఎన్ త్రినాథ్, ఉపాధ్యక్షులు శ్రీరంగం సత్యప్రసాద్, ఎ.రాజా, కోటేశ్వరరావు, గోపాలకష్ణ, జెకె.వెంకటరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అవసరం

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రతి గర్భిణీ స్త్రీలు, బాలింతలు పోషక విలువల ఆహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ పూర్ణిమ తెలిపారు. శనివారం పక్వాడ పక్షోత్సవాల కార్యక్రమం ముగింపు సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల బరువు, ఎత్తు చూసి వెల్ బేబీ షో కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య వంతమైన పిల్లలకు బహుమతి ప్రదానం చేశారు. కిషోరి బాలికలకు బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలను, అక్రమ రవాణా గురించి, కిశో ర బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేసి, తక్కువ ఖర్చుతో పోషక విలువలు గల ఆహారాన్ని ఏవిధంగా తీసుకోవాలి అనే దానిపై వివరించారు. ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారం కూడా గర్భవతులు, బాలింతలు తీసుకోవాలని, నిర్ణీత సమయంలో ఆహారం తీసుకోవాలని, వెయ్యి రోజుల ప్రాముఖ్యత ను వివరించారు. సుపోషిత భారత దేశం దిశ గా పోషకాహార ప్రాముఖ్యత ను తెలియజేస్తూ తల్లులచే ప్రతిజ్ఞ చేయించి పోషకాహార తరగతులు నిర్వహించారు. పోషణ పక్వాడ ను ప్రజలకు అవగాహన చేస్తూ భారీ గా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సునీత, అమ్మాజీ, బేగం, బూసమ్మ, పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

వల్లభ స్వామికి రూ.3.52 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒక రోజు వివిధ రూపాల్లో రూ.3.52 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహకాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దీనిలో వివిధ టిక్కెట్ల ద్వారా రూ.2,86,700, అన్నదాన విరాళాల ద్వారా రూ.60,237, కేశఖండన ద్వారా రూ.5,720, తులాభారం ద్వారా రూ.300 ఆదాయం సమకూరిందని వెల్లడించారు. ఈ సందర్భ:గా యాత్రికులకు ఉదయం పులిహార ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, ఎంపిటిసి సభ్యులు కుంచే బుచ్చిరాజు, అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, గ్రామస్తులు యాత్రికులకు సేవలందించారు.

పశు సంచార వైద్య సేవలు ఎంతో మేలు

ప్రజాశక్తి - కోటనందూరు

పశు సంచార వైద్య సేవలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని పశు వైద్యా ధికారి నెమ్మది రామారావు అన్నారు. శనివారం మండలం లోని కెఇ.చిన్న యపాలెం, అల్లిపూడి, జగన్నాధపురం, పాతకొట్టం గ్రామాల్లో ఆయన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగాల బారిన పడి లేవలేని స్థితిలో ఉన్న పశువుల వద్దకే వెళ్లి వైద్య సేవలను అందించడమే సంచార వైద్య సేవల లక్ష్యమన్నారు. వాహనంలోనే మందులు వైద్య పరికరాలు ఉండటం వల్ల పశువుల ప్రాణాలను సకాలంలో కాపాడు కలుగుతున్నామని అన్నారు. సహాయక సిబ్బంది ఫైలు దుర్గాప్రసాద్, సుర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజ నీరింగ్ కళాశాల మెకా నికల్ ఇంజనీరింగ్ విభాగంలో రెండు రోజుల పాటు నిర్వ హించిన అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా పూర్తయింది. మొదటి రోజు అంతర్జాతీయ సదస్సులో తిరుచ్చి ఎన్ఐటి ప్రొడక్షన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వి.ఆనందకృష్ణన్, 2వ రోజు కాకినాడ జెఎన్‌టియు మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. వివిధ పరిశోధనలకు చెందిన రీసెర్చ్ పేపర్స్ ఈ సదస్సులో ప్రదర్శించబడ్డాయి ఈ ముగింపు కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రీసెర్చ్ మరియు డెవలప్మెంట్ డీన్ డాక్టర్ కెవిఎన్.రామచంద్రమూర్తి, స్టూడెంట్ అఫైర్స్ జెడి వెంకటేష్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎ.శర వణన్, కన్వీనర్స్ డాక్టర్ పివి.ఎలుమలై, డాక్టర్. సందీప్ కునార్, కో కన్వీనర్ డాక్టర్ ఐ.వీరాంజనేయులు, డాక్టర్ ఎం.జుబే రుద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణికుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సామర్లకోట

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజమహేంద్రవరం, కాకినాడ, తుని, సామర్లకోట రైల్వే స్టేషన్లో ప్రయాణికుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైల్వే డిఎస్‌పి ఎల్.మోహన్‌రావు ఆదేశించారు. శనివారం సామర్లకోట రైల్వే స్టేషన్‌లో తుని, కాకినాడ, రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లకు చెందిన చెందిన జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్ల ద్వారా అక్రమంగా గంజాయి, మద్యం, నగదు, బంగారం వంటి తరలింపులకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రయాణికుల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో రైల్వే ఇన్‌స్పెక్టర్లు గౌస్‌బేగ్, డి.సైదయ్య, సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్, రైల్వే ఎస్ఐలు బి.లోవరాజు, అబ్దుల్ మరూఫ్, ఎన్.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు : అప్పనపల్లి బాల బాలాజీ శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాత విరాళం అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన కోన రాధాకృష్ణ, లక్ష్మీ దుర్గ దంపతులు కుమారుడు కోనరోషన్ వెంకట శ్రీ కిరణ్ పుట్టినరోజు ప్రతి ఏటా జనవరి4న అన్నదానం నిమిత్తం రూ.1,00,116 విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్, ఇఓ గ్రంధి మాధవి తెలిపారు.

సోడా కంపెనీ ప్రారంభం

అమలాపురం రూరల్ : రోళ్లపాలెం జంక్షన్ బైపాస్ రోడ్డు పక్కన నేదునూరి వేణుగోపాల రెడ్డి ఆధ్వర్యంలో మెలోడియస్ ఫుడ్స్ అండ్ బెవరేజ్స్ గోలి సోడా కంపెనీ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ అధినేత నేదునూరి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం 15 రకాల రుచులలో ప్రారంభించామని అన్నారు. తమ వద్ద 180 రకాల రుచుల వరకు ఉన్నాయని, ఇందులో సుగర్ లెస్ గోలి సోడా, షుగర్ లెస్ డ్రింక్స్ కూడా భవిష్యత్తులో తయారు చేస్తామని అన్నారు.